ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 జనవరి 17, 2015

తెలంగాణ రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చడమే లక్ష్యంగా అటవీ శాఖ అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణలో అడవుల శాతాన్ని ప్రస్తుతం ఉన్న 25 శాతం నుండి 33 శాతానికి పైగా ఉండేలా చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణను నిలపాలని కోరారు. అటవీ శాఖలోని ఖాళీలు భర్తీ చేస్తామని, వేతన సవరణ చేస్తామని, వాహన సౌకర్యం కల్పిస్తామని, పోలీసు భద్రత ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. నగర శివారులోని దూలపల్లిలోని ఫారెస్టు అకాడమీలో శనివారం రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. అటవీ శాఖలోని రేంజర్లు, డిఎఫ్ఓలు, కన్సర్వేటర్ల అభిప్రాయాలు తీసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అటవీ భూమి అన్యాక్రాంతానికి గురువుతున్నదని, దాని రక్షణకు పాటు పడే సందర్భంలో ప్రాణ హాని కూడా జరుగుతున్నదని ముఖ్యమంత్రికి అటవీ శాఖ అధికారులు విన్నవించారు. స్మగ్లర్లు, భూ ఆక్రమణ దారులు, గుత్తి కోయల నుండి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. కొంత మంది ఫారెస్టు అధికారులు స్మగ్లర్ల చేతిలో హత్యకు గురైన సంఘటనలు కూడా అధికారులు చెప్పడంతో ముఖ్యమంత్రి చలించిపోయారు. అటవీ శాఖ ఆక్రమణల పట్ల, కలప స్మగ్లర్ల పట్ల అంత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను అధ్యయనం చేసి అవసరమయితే కొత్త చట్టాలను తీసుకురావాలని కూడా అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అటవీ శాఖ సిబ్బందికి సాయుధ పోలీసుల అండ కూడా ఉండేలా చూస్తామన్నారు. స్మగ్లర్ల నుండి, కబ్జా దారుల నుండి ఇబ్బందులు తలెత్తితే ఫోన్ చేసిన గంట లోపలే కనీసం రెండు డజన్ల మంది సాయుధ పోలీసులు అటవీ శాఖ అధికారులకు తోడయ్యే వ్యవస్థను రూపొందిస్తామన్నారు. గుత్తి

కోయలు కూడా అడవికి, అటవీ శాఖాధికారులకు ముప్పుగా మారారని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో కూడా కఠినంగానే ఉండాలని, అడవికి ప్రమాదంగా మారిన గుత్తి కోయల ప్రవేశాన్ని పకడ్బందీగా అరికట్టాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులకు చెప్పారు. అటవీ సంబంధమయిన కేసులు సత్వరం పరిష్కారం అయ్యేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని, హైకోర్టు నుండి జిల్లా కోర్టుల వరకు కేసులు వాదించడానికి అటవీ శాఖలో ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

అటవీ శాఖ గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యిందని, ఎడారిగా మారిపోయిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు రిజర్వు ఫారెస్టులో ఉన్నప్పటికీ అందులో చెట్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు అంతరించడం వల్ల వర్షాలు కురువడం లేదని చెప్పారు. అడవుల్లో పండ్లు తిని బతికే కోతులు కూడా గ్రామాల్లో బీభత్సం సృష్టించడానికి అడవుల్లో చెట్లు లేకపోవడమే కారణమని ముఖ్యమంత్రి అన్నారు. వానలు వాపసు రావాలన్నా, కోతులు తిరిగి అడవుల్లోకి వెళ్లాలన్నా, వాతావరణం సమతుల్యంగా ఉండాలన్నా అడవులు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అడవుల రక్షణ విషయంలో ఖర్చుకు వెనకాడేది లేదని, నిధుల కొరత అనే సమస్య రాదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల కోసం అటవీ శాఖ భూమిని తీసుకునే క్రమంలో మరో చోట అంతే భూమిని కేటాయించిన తరువాతే అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఫారెస్టు డెవలప్‌మెంట్ సెస్ పేరిట కూడా అటవీ శాఖకు ప్రత్యేక నిధి ఉండేలా చూస్తామన్నారు. అడవుల్లో వ్యవసాయం చేసుకునే వారికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ (రిజర్వేషన్ ఆఫ్ ఫారెస్టు రైట్స్–అటవీ భూముల పట్టా) విషయంలో కూడా అవకతవకలు జరుగుతున్నాయని, కేటాయించిన భూమి కన్నా ఎక్కువ విస్తీర్ణాన్ని ఆక్రమించుకుంటున్నారని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి భవిష్యత్తులో ఆర్ఒఎఫ్ఆర్‌లు ఇవ్వకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. పట్టాలో ఉన్నదానికన్నా ఎక్కువ ఆక్రమించుకున్న వారి పట్ల కఠినంగా

ఉండాలని చెప్పారు. ఇప్పటికీ అటవీ శాఖాధికారులపై దాడులు జరుగుతున్నాయని చాలా మంది రేంజర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తనకు కలప స్మగ్లర్ల నుండి ప్రాణ హాని ఉందని నిజామాబాద్ జిల్లా ఇందెలవాయి రేంజర్ రాజేందర్ సిఎం దృష్టికి తేగా ముఖ్యమంత్రి అతనికి గన్‌మెన్‌ను ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. ఇంకా ఎ ఎ అధికారికి స్మగ్లర్ల నుండి ముప్పు ఉందో పరిశీలించి భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాల వారిగా కలప స్మగ్లర్లు, అటవీ భూముల ఆక్రమణ దారుల వివరాలు సమర్పించాలని కోరారు. కలెక్టర్లు, అటవీ శాఖాధికారులు జాయింట్ సర్వే నిర్వహించి అటవీ భూములకు హద్దులు నిర్ణయించాలని చెప్పారు. భూ భారతి సర్వే కూడా ఉమ్మడిగానే నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని నర్సరీలలో మొక్కల పెంపకానికి ఒకే రేటు చెల్లించాలని ఆదేశించారు. గ్రామాల్లో దోమల నివారణకు ఔషధ మొక్కలు పెంచాలన్నారు. నియోజకవర్గ ల్యాండ్ అసైన్‌మెంట్ కమిటీల్లో ఫారెస్టు అధికారులను కూడా సభ్యులుగా చేర్చాలని ఆదేశించారు. నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్ లాంటి జిల్లాల్లో అడవుల శాతాన్ని బాగా పెంచాల్సి ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కొంత మేర అడవి ఉందని, మరికొన్ని ప్రాంతాల్లో అడవి లేదని చెప్పారు. ఉన్న చోట అడవిని రక్షించాలని, లేని చోట చెట్లను పెంచాలని సిఎం ఆదేశించారు. జిహెచ్ఎంసి పరిధిలో 1,50,000 ఎకరాల అటవీ భూమి ఉందని, భూమిని రక్షించడంతో పాటు పచ్చదనం పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం జిహెచ్ఎంసి నుండి రూ. 25 కోట్లు కేటాయిస్తామని, ఒక అటవీ శాఖాధికారిని జిహెచ్ఎంసిలో నియమిస్తామని సిఎం చెప్పారు. అటవీ శాఖలో ఖాళీలు భర్తీ చేస్తామని, డిప్యూటేషన్లు రద్దు చేస్తామని, ఇతర శాఖల పనులు అప్పగించేది లేదని సిఎం స్పష్టం చేశారు. అటవీ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న విలేజ్ ఫారెస్టు వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేస్తామని సిఎం హామినిచ్చారు. అడవుల్లో ప్రవహించే నదులు, ఉప నదులు, వాగులు, వంకలపై ఎక్కువ సంఖ్యలో చెక్‌డ్యాంలు నిర్మించాలని చెప్పారు. అటవీ భూమిని ఆక్రమించాలన్నా, కలప స్మగ్లింగ్

చేయాలన్నా వళ్లు జలదరించే విధంగా ప్రభుత్వ చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సామాజిక అడవుల పెంపకానికి ప్రత్యేక కమీషనరేట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అటవీ శాఖాధికారులు తమ అభిప్రాయాలు పంచుకోవడానికి, సమస్యలు చెప్పుకోవడానికి తనకు, అటవీ శాఖ మంత్రికి లేఖలు రాస్తే చాలని ముఖ్యమంత్రి చెప్పారు.

ఈ సమావేశంలో అటవీ శాఖ మంత్రి జోగు రామన్న, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావ్, మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ బిఎల్.మిశ్రా, అకాడమీ డైరెక్టర్ రఘువీర్, అడిషినల్ డైరెక్టర్ పిసిసిఎఫ్ శర్మ, నగర పోలీసు కమీషనర్ మహేందర్‌రెడ్డి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం